నిల్వ జలం.. వ్యాధుల భయం



భట్టిప్రోలు మండలం పెసర్లంక ఎంపీపీ పాఠశాలకు వెళ్లే రహదారిలో నిల్వఉన్న వరద నీరు

వరద వీడి రెండు వారాలు గడుస్తున్నా కృష్ణానది పరీవాహక కరకట్ట దిగువ ప్రాంతాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇంకా వరద నీరు నిలిచిఉంది. ఈ నీరు ఎటూ పోయే అవకాశం లేకపోవడంతో వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు భీతిల్లుతున్నారు. రాత్రిళ్లు దోమల బెడదతో కంటిమీద కునుకు కరువవుతోందని స్థానికులు వాపోతున్నారు. నిల్వ నీటిని మోటార్ల ద్వారా బయటకు తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – భట్టిప్రోలు


చింతమోటు గౌడ కాలనీలో ఎటూ పోయే మార్గం లేక నిల్వ చేరిన వరద నీరు

క్లుప్తంగా

గణేష్ ఉత్సవాలలో అన్నదానం



కర్లపాలెం: విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరునికి పూజలు చేయటం అభినందనీయమని కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. శనివారం కర్లపాలెం పంచాయతీ గౌడపాలెంలో జరిగిన గణపతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

బాపట్ల: మరణానంతరం ఇతరులకు సైతం చూపు ప్రసాదించవచ్చనే ఉద్దేశంతో బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెంకు చెందిన తగిరిశ సుబ్బారావు గతంలో నేత్రదానం చేశారు. శుక్రవారం ఆయన మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పెదకాకాని శంకర నేత్రాలయం వైద్యులు సుబ్బారావు కార్నియాలు సేకరించారు. సుబ్బారావు నేత్రదానంతో ఆరుగురికి చూపు ప్రసాదించేందుకు అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళలు అరెస్ట్

కర్లపాలెం: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు పంపామని కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పేరలి గ్రామంలో ఇరువురు మహిళలు మద్యం విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి తమ సిబ్బందితో సోదాలు నిర్వహించామన్నారు. దామారి మిస్సమ్మ వద్ద 11 క్వార్టర్ బాటిళ్ళు, ఈపూరి నాగమ్మ వద్ద 16 క్వార్టర్ బాటిళ్ళు స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్ ..

బాపట్లటౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలోని నరసాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. నరసాయపాలెం గ్రామానికి చెందిన దాసి నాగభూషణం కూల్‌డ్రింగ్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో రూరల్ సీఐ గంగాధరరావు శనివారం దాడి చేసి అతని వద్ద నుంచి 24 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



చెరుకుపల్లి: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలటంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన చెరుకుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అనిల్ కుమార్ వివరాల మేరకు చెరుకుపల్లి కస్తూరిపేటకు చెందిన ఎన్నూరు సాయిమణికంఠ(22) స్మశానవాటిక సమీపంలోకి వెళ్తున్న క్రమంలో కిందగా వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగలటంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలాడన్నారు. గమనించిన స్థానికులు మణికంఠను పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడన్నారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించామని, పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మాదిగల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

తెనాలిరూరల్: ఈ నెల 21న తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు నిర్వహించనున్నాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పాల్గొననున్న కార్యక్రమ పోస్టర్‌ను ఆహ్వాన కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు శనివారం మార్కెట్ యార్డులో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాదిగలందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూచిపూడి సత్యం, వేమూరి సుధీర్, బోసుబాబు, ఆలపాటి కరుణ, తబిత, జ్యోతి, పులివర్తి లక్ష్మయ్య, మేకల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమర కళాకారుల సంస్మరణ

తెనాలి: మహిళలు బయటకు రాలేని పూర్వం రోజుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదిరించి, గ్రామగ్రామాన ప్రజాచైతన్య ప్రదర్శనలిచ్చిన వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, సౌమిత్రి చిరస్మరణీయులని శనివారం సాయంత్రం జరిగిన అమరకళాకారుల సంస్మరణ సభలో పలువురు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఇస్కఫ్ హాలులో ఏర్పాటైన సభకు సినీ డబ్బింగ్ కళాకారిణి వాల్మీకి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

- అవాంఛనీయ ఘటనలు తలెత్తితే కమిటీ సభ్యులదే బాధ్యత
- గణేష్ ఉత్సవకమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించిన పోలీసులు


ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

బాపట్లటౌన్: గణేష్ ఉత్సవాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసు సిబ్బంది తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశాలు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వినాయక విగ్రహాల ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు తలెత్తడానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ఊరేగింపులలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కమిటీ సభ్యులు వ్యవహరించాలన్నారు. ఏవైనా ఘటనలు చోటు చేసుకుంటే పోలీస్ శాఖ తీసుకొనే చర్యలు గురించి క్షుణ్ణంగా వివరించారు. గతంలో జరిగిన ఘర్షణలు పునరావృతం అయితే కమిటీ సభ్యులే బాధ్యులవుతారన్నారు. ఇతరులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. మద్యం సేవించిన వ్యక్తులను, చిన్నపిల్లలను, మహిళలను విగ్రహ ఊరేగింపు వాహనంలో నిమర్జనం ప్రదేశానికి తీసుకొని రావద్దన్నారు. కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విగ్రహాల వద్ద ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉంటే కమిటీ సభ్యులు ముందుగా స్థానిక పోలీస్ అధికారులకు, డయల్ 100, 112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి

ఎస్ఐ తిరుపతిరావు


గణేష్ విగ్రహ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

నిజాంపట్నం: గణేష్ నిమజ్జన సమయంలో భక్తులు విధిగా ప్రభుత్వం తెలిపిన నిబంధనలను పాటించాలని ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. మొగదారమ్మ తల్లి ఆవరణంలో నెలకొల్పిన గణేశ్ విగ్రహాన్ని ఈనెల 15వతేదీన నిమజ్జనం నిర్వహించనున్న సందర్భంగా కమిటీ సభ్యులు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై ఆలయ ఆవరణంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసే సమయంలో ఎటువంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ సమయమనం పాటించాలన్నారు. తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా భక్తి శ్రద్ధలతో విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించాలని చెప్పారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని, ఎంతటి వారినైనా శిక్షించటం జరుగుతుందని హెచ్చరించారు. విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అవసరం

విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ మాలకొండయ్య


కొల్లిపరలో సాయిల్ సెన్సార్ వద్ద మాజీ డీజీపీ మాలకొండయ్య

తెనాలి: ప్రతి గ్రామంలోనూ రైతులు కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేసుకుని ముందుకు వెళ్లాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ మాలకొండయ్య సూచించారు. మండల కేంద్రం కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్, సోలార్ డ్రైయ్యర్, ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించారు. జర్మనీ సంస్థ 'న్యూ ఐరా' తోడ్పాటుతో పంటపొలాల్లో భూమి ఆరోగ్య పరిశీలనకు ఏర్పాటుచేసుకుని సాయిల్ సెన్సర్లను చూశారు. సెన్సర్ పని తీరును స్వయంగా పరిశీలించారు. ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న పంటలను గురించి తెలుసుకున్నారు. అనంతరం కలెక్షన్ సెంటరులో ఏర్పాటైన సభలో రైతుల నుద్దేశించి మాట్లాడారు. రైతులు సంఘటితంగా వ్యవసాయం చేస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం చూపిన బాటలో అన్ని గ్రామాల్లోనూ రైతులు సంఘాలుగా ఏర్పాటయితే బాగుంటందన్నారు. సంఘం ఆధ్వర్యంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (జీఏపీ), ఆర్గానిక్ సర్టిఫికెట్లను రైతులకు అందజేస్తుండటం శుభపరిణామంగా చెప్పారు. కేంద్రప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఎంతగానో తోడ్పడుతోందని చెప్పారు. అదేవిధంగా ప్రతిరైతు కూడా, తనకున్న భూమిలో కొంతమేరయినా సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని, ఫలితంగా ఆరోగ్యకర ఆహారం తీసుకోవచ్చని, భూమి ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్శిటీ అగ్రికల్చర్ కాలేజి డీన్ డాక్టర్ తాతినేని రమేష్‌బాబు, అసిస్టెంట్ డీన్ వై.వరప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.హరిష తదితరులు మాట్లాడారు. శ్రేష్ట సంఘం డైరెక్టర్లు నెర్ల కుటుంబరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, వుయ్యూరు సాంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సుబ్రహ్మణ్యం

తెనాలిఅర్బన్: శ్రీ స్వామి జ్ఞాన ప్రసన్న పిలుపు మేరకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో తెనాలి ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ సోకిన చిన్నారులకు పోషకాహారం కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి.జనార్ధనరావు, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50మంది చిన్నారులకు శనగలు, కందిపప్పు, రాగిపిండి, గోధుమలు, బెల్లం వంటి వాటిని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ, తుల్లిమిల్లి పోతురాజు, అక్కల రమేష్, కుర్రా శ్రీనివాసరావు, బాణవత్ బాలు నాయక్, గుమ్మడి నారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



కొల్లూరు: వరద బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ తమ వంతు సాయమందించి దాతృత్వాన్ని చాటుకుంది. మండలంలోని జువ్వలపాలెంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ముంపు పీడితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి సమకూర్చిన వంట పాత్రలు, టార్పాలిన్ పరదాలను అందించారు. సర్పంచి భూపతి కిశోర్, సొసైటీ వలంటీర్లు డి.వంశి, కార్తీక్, జైచంద్ర, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ చక్కటి వేదిక



తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎం. శ్రీధర్, పవన్‌కుమార్, వివేక్ వర్ధన్, పి.రాజశేఖర్, మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 57 సివిలు, 144 క్రిమినల్, 14 ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. భాదితులకు రూ. 3,58,93,333 పరిహారం కింద అందించారు. లోక్ అదాలత్ మెంబర్లుగా ఎస్వీ మహేశ్వరరావు, సోలా శంకర్, శారదా, జి. వెంకయ్య వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ పాల్గొన్నారు.

కాల్వలో మృతదేహం

తెనాలిరూరల్: మండలంలోని నందివెలుగు గ్రామం వద్ద నిజాంపట్నం కాల్వలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉంది. ఇటీవల వరదల్లో మృతి చెంది పై నుంచి కొట్టుకువచ్చి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కవోని దీక్షతో 'సాగు'తాం..


ఈపూరు సమీపంలో వరదకు పంట నష్టపోయిన పొలంలో మినుము సాగుకు భూమిని దున్నుతున్న రైతు

కొల్లూరు: వరదలు చేసిన పంట నష్ట గాయాలతో ఉన్న రైతాంగం మొక్కవోని దీక్షతో సాగు సమరానికి తిరిగి సమాయత్తమవుతున్నారు. వరదలకు వాణిజ్య పంటలు పనికిరాకుండా పోయి ఏర్పడిన నష్టాన్ని పంటి బిగువున భరిస్తూనే రెండో పంటగా మినుము సాగుచేసేందుకు పదును తేలిన భూములను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని ఈపూరు, పెదలంక తదితర గ్రామాలలో వరద నీటి ముంపు నుంచి బయట పడిన పొలాల్లో మినుము సాగుకు అదునైన సమయం కావడంతో భూములు దుక్కులు దున్ని విత్తనాలు చిమ్ముకుని సాగుకు సిద్ధమవుతున్నారు.

నవ విధ భక్తిమార్గాలతో ముక్తిమార్గం

సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న జిల్లా ధర్మప్రచారక్ హేమశంకరరావు

రేపల్లె రూరల్: నవవిధ భక్తిమార్గాలతో దైవాన్ని స్మరిస్తూ ముక్తిమార్గాన్ని పొందవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మండలంలోని పోటుమెరక జలార్దమ్మ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు, తుకారం వంటి అనేక మంది భక్తసాధకులు సంకీర్తనలు చేస్తూ దైవానుగ్రహం పొందారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను ఆయా మార్గాలలో ఆరాధిస్తూ ముక్తిని పొందాలన్నారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి జీవితాన్ని భక్తులకు తెలిపారు. శ్రీ మహావిష్ణు భజన భక్త బృందం సభ్యులచే భజన కార్యక్రమం చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ రేపల్లె మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, రేపల్లె చెంచయ్య, శ్రీకృష్ణయ్య, బొల్లిముంత సుందరామిరెడ్డి, కామయ్య, వీర రాఘవయ్య, పున్నమ్మ, బుల్లిబాబు, అర్చకులు కట్టా మహేష్ పాల్గొన్నారు.

ఒంగోలు సీఎస్సార్ కళాశాల పూర్వ విద్యార్థుల చేయూత


పెసర్లంక పల్లెపాలెం గ్రామస్తులకు సాయం అందజేస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెసర్లంక పల్లెపాలెంకు చెందిన 212 వరద బాధిత కుటుంబాలకు ఒంగోలు సీఎస్సార్ కళాశాల (1987–1990 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తం అందించారు. శనివారం పెసర్లంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేములపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు రెండు దుప్పట్లు, ఒక టవల్, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఒంగోలు డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ కృష్ణ కుమార్ మిత్ర బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెసర్లంక హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ వి.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వెల్లటూరు ఉపాధ్యాయుడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


కాకినాడలో అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు మురళీమోహన్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ రాష్ట్ర ఉత్తమ గురు బ్రహ్మ అవార్డును శనివారం కాకినాడలో అందుకున్నారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని అక్కడ సూర్య కళామందిర్‌లో ఈ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ అవార్డును అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రవి కుమార్, అలీమ్ షరీఫ్ మహమ్మద్ చేతుల మీదుగా అందుకున్నారు. మురళీమోహన్ ఏపీసీపీఎస్ఈఏ బాపట్ల జిల్లా అధ్యక్షులుగా ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ ఇటీవల వరద ప్రభావిత గ్రామాల్లో విశేష సేవలు అందించారు.

రేషన్‌బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

తెనాలిరూరల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలించేందుకు బాస్తాలను నింపుతున్న మినీ లారీని పోలీసులు సీజ్ చేసి 59 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎండీయూ వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోగా, మినీ లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వివరాలను సీఐ మల్లికార్జునరావు తెలియజేశారు. తెనాలి పట్టణంలోని రామలింగేశ్వర పేట తోటవారి వీధిలో అక్రమంగా రేషన్ బియ్యం రవాణా జరుగుతుండటంపై శనివారం తెల్లవారుజామున తమకు సమాచారం వచ్చినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కార్డు దారులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేసే వాహనం నుండి ఓ మినీ లారీలోకి పీడీఎస్ బియ్యం లోడ్ చేస్తుండటాన్ని గుర్తించి రేషన్ వాహనం డ్రైవర్ ప్రసాదం వెంకటకిషోర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. మినీలారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా వారికి డబ్బులు ఇచ్చి ఈ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని చెప్పారు. ఈ బియ్యం ఎక్కడకు తరలిస్తున్నారు? ఎవరి పాత్ర ఉంది? అన్న అంశాలు విచారణలో గుర్తిస్తామని సీఐ తెలిపారు.

నడక యాతన



చింతమోటు, పెసర్లంక గ్రామాలకు వెళ్లే మార్గంలో దెబ్బతిన్న రహదారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం చింతమోటు పెదలంక, పెసర్లంక లంక గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వరదలకు రోడ్లు చిన్నాభిన్నమయ్యాయి. రహదారులు గుంతలు పడటంతో వాహనదారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు దెబ్బతిన్న వాణిజ్య పంటలు, మునిగిన గృహాలను పరిశీలించేందుకు విచ్చేయనుండటంతో అధికారులు హడావుడిగా గుంతల్లో గ్రావెల్ నింపారు. అదే విధంగా గొరిగపూడి, ఓలేరు, పెదపులివర్రు ప్రాంతాల నుంచి లంక గ్రామాలకు చేరుకునే రహదారులు కూడా పూర్తిగా దెబ్బతిని, వాహనచోదకులకు నరకం చూపిస్తున్నాయి.